నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 3 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఖమ్మం కలెక్టర్, నివాళులర్పిస్తున్న కలెక్టర్, సీపీ (ఇన్‌సెట్)

జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ, (ఇన్‌సెట్) అమరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ ప్రియాంక

తెలంగాణలో ప్రగతి పరుగులు

పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అద్భుత అభివృద్ధి

రాష్ట్ర సాధన ఉద్యమంలో జిల్లా ప్రజల పాత్ర మరువలేనిది

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

దేశానికి దిక్సూచిగా నిలుద్దాం: భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

జాతీయ పతాకం ఆవిష్కరణ.. గౌరవ వందనం స్వీకరణ..

ఖమ్మం వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కొత్తగూడెంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు

ఖమ్మం, జూన్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ప్రగతి పరుగులు పెడుతోందని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అద్భుత అభివృద్ధిని సాధించిందని అన్నారు. ఖమ్మం జిల్లా కూడా గతానికి భిన్నంగా అభివృద్ధి ఉజ్వలంగా ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భగా ఐడీవోసీలో ఆదివారం ఆదివారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా సీపీ సునీల్‌దత్‌తో కలిసి ఖమ్మం మయూరిసెంటర్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐడీవోసీలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి త్యాగం ఎన్నటికీ మరువలేదనిదని అన్నారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రజలందరూ ముందుకు నడవాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు ముగిసి పదకొండో వసంతంలోకి అడుగు పెట్టడం ఒక మైలురాయి అని అభివర్ణించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటున్నారని అన్నారు. వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో వరుసగా వచ్చిన అసెంబ్లీ, పార్లమెంటు, మండలి ఎన్నికలను ప్రజల సహకారంతో ప్రశాంతంగా నిర్వహించామని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిపాలనకు పునరంకితం కావాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనాన్ని స్వీకరించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శసురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా ఉండాలి

ఆవిర్భావ వేడుకల్లో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆకాంక్షించారు. సంక్షేమమే ధ్యేయంగా అందరమూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే దేశానికి దిక్సూచిగా నిలుస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఐడీవోసీలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుని పదకొండో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామని అన్నారు. ఎందరో అమరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పోరాట చరిత్ర ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, కళాకారులు, కార్మికులు, మహిళలు సహా సబ్బండ వర్గాల ప్రజలు ఏకమై కదిలారని జ్ఞప్తికి తెచ్చారు. ప్రత్యేక తెలంగాణలో ఏర్పడిన మన భద్రాద్రి జిల్లా గిరిజన గిరిజనేతరుల కలయికతో అభివృద్ధిలో ముందుకెళ్తోందని అన్నారు. మన జిల్లా కూడా రాష్ట్రానికి తలమానికం కావాలని ఆకాంక్షించారు. ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాకారులు ఉద్యమాల పాటలు అలరించాయి.

అమరులకు నివాళి..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతిమైదానంలో ఉదయం 8:30 గంటలకు ప్రగతిమైదానంలో అమరుల స్తూపం వద్ద పూలు చల్లి అమరువీరులకు కలెక్టర్ ప్రియాంక నివాళులర్పించారు. ఎందరో త్యాగధనుల ఫలమే నేటి స్వేచ్ఛా వాయువుల తెలంగాణ అని గుర్తుచేశారు.

ఖమ్మం ఐడీవోసీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరైన వివిధ శాఖల అధికారులు, అతిథులు

'తెలంగాణ భవన్'లో జిల్లా నేతలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్సవాల్లో పార్టీకి చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ అక్కడి అమరవీరుల స్తూపం వద్ద పూలు చల్లి ఉద్యమ కాలాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై కూడా పూలు చల్లారు. ఈ వేడుకల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

దేశ అవసరాల మేరకు బొగ్గు ఉత్పత్తి

భారీ యంత్రాలను 20 గంటలు వినియోగించుకోవాలి

ఈ ఏడాది 720 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాలి

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెంలో కేక్ కట్ చేస్తున్న సింగరేణి సీఎండీ బలరాం, ఎమ్మెల్యే కూనంనేని

ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 2: దేశ అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి, దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి మనందరమూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ప్రధాన వేడుకల్లో సీఎండీ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా హెడ్డాఫీస్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి, బస్టాండ్ సెంటర్‌లో అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రలోనే రికార్డు స్థాయిలో అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, బొగ్గు రవాణాను సింగరేణి సాధించిందని, అలాగే అత్యధికంగా రూ.37,500 కోట్ల టర్నోవర్‌ను గడించి సరికొత్త రికార్డు సృష్టించిందని వివరించారు. ఇంతటి ఘనమైన విజయాన్ని అందించిన సింగరేణియులకు అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. రాష్ట్రంలోనే కాకుండా సింగరేణి సంస్థతో ఇంధన ఒప్పందం ఉన్న దాదాపు 8 రాష్ట్రాల్లోని 20 థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కూడా నిరాటంకంగా బొగ్గును సరఫరా చేస్తూ ఆ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు సజావుగా పనిచేసేందుకు దోహదపడుతున్నామని గుర్తుచేశారు. భారీ యంత్రాలు ప్రస్తుతం రోజుకు 15 నుంచి 16 గంటల పాటు మాత్రమే పనిచేస్తున్నాయని, దీనిని కనీసం 20 గంటలకు పైగా తీసుకొస్తే 20 శాతం ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, తద్వారా మన ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు. గత మార్చి నెలలో ఓపెన్ కాస్ట్ గనుల్లో 20 – 22 గంటల పాటు భారీ యంత్రాలను వినియోగించుకొని అద్భుతమైన ఉత్పత్తులను సాధించామని గుర్తుచేశారు. ఈ ఏడాదికి నిర్దేశించుకున్న 720 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాలని కోరుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా అన్ని ఏరియాల్లో ఉత్తమ ప్రదర్శన కనపర్చిన అధికారులకు, కార్మికులకు సన్మానించారు. సింగరేణి విభాగాల బాధ్యుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సంస్థ ఉన్నతాధికారులు బీఆర్ దీక్షితులు, సత్యనారాయణరావు, యూనియన్ల నాయకులు రాజ్‌కుమార్, త్యాగరాజన్, పొనుగోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఎంపీ రవిచంద్ర నివాసంలో భోజనం చేస్తున్న కేటీఆర్, నేతలు

'కేటీఆర్'కు 'వద్దిరాజు' ఆతిథ్యం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆతిథ్యం ఇచ్చారు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం.. రవిచంద్ర ఆహ్వానం మేరకు ఆదివారం మధ్యాహ్నం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ వద్దిరాజు నివాసానికి కేటీఆర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కే.ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, రసమయి బాలకిషన్, ప్రముఖులు గంగుల సుధాకర్, గాలి అనిల్‌కుమార్, చల్లా హరిశంకర్, వాసుదేవరెడ్డి తదితరులతో కలిసి ఎంపీ వద్దిరాజు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మనుమరాలు సహశ్రికను కేటీఆర్ ముద్దుచేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో ఫొటోలు దిగారు. –ఖమ్మం, జూన్ 2:

ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పరిశీలించిన ఖమ్మం కలెక్టర్, సీపీ, పరిశీలకులు

కౌంటింగ్ పరిశీలకుడిని సన్మానిస్తున్న కలెక్టర్

కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, సీపీ సునీల్‌దత్

ఖమ్మం రూరల్, మే 2: ఖమ్మం మండలంలోని పొన్నెకల్ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం లోక్‌సభ సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రం ఖమ్మం పార్లమెంట్ ఆర్వో, కలెక్టర్ వీపీ గౌతమ్.. లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, కౌంటింగ్ పరిశీలకుడు ప్రేదిమాన్ కృష్ణన్ భట్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టేబుళ్లు, కౌంటింగ్ హాళ్లు, సిబ్బంది, ఏజెంట్ల ప్రవేశం తదితర ఏర్పాట్ల గురించి రిటర్నింగ్ అధికారి పరిశీలకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బీ సత్యప్రసాద్, డీ మధుసుదన్‌నాయక్, ఎం రాజేశ్వరీ, గణేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ పరిశీలకులను కలిసిన కలెక్టర్

మామిళ్లగూడెం, జూన్ 2: లోకసభ ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు ప్రేదిమాన్ కృష్ణన్ భట్ ఆదివారం జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఆఫీసర్స్ గెస్ట్ హౌజ్‌లో ఉన్న ఆయన్ను కలెక్టర్ గౌతమ్ మార్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ అబ్జర్వర్లు వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌ను పరిశీలిస్తారని తెలిపారు.

ఐఅండ్‌పీఆర్‌కు పెద్ద దిక్కెవరు?

- **పత్రికలకు సకాలంలో అందని అధికారిక సమాచారం**
- **ఆ కార్యాలయానికి వెళ్తే కనిపించేవారు కరువు**
- **ఇంఛార్జి డీపీఆర్‌వోలతో అరకొర పాలన**
- **ఐడీవోసీకే పరిమితమైన జిల్లా సమాచార వ్యవస్థ**



డీపీఆర్‌వో కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి జిల్లాలో సమాచార, పౌర సంబంధాల (ఐఅండ్‌పీఆర్) శాఖ పాలనా విభాగం అరకొరగా, అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో సమాచారం అందే మీడియాకు, పత్రికలకు.. ప్రభుత్వ పాలన విభాగంలో అధికారిక సమాచారం అందడం మాత్రం అత్యంత కష్టతరమవుతోంది. అసలు ఈ జిల్లాలో ఈ శాఖకు పెద్ద దిక్కు కరువైనట్లుగా ఉంది. కొత్త జిల్లా ఏర్పాటు తర్వాత వచ్చిన డీపీఆర్‌వో తప్ప.. ఆ తర్వాత రెగ్యులర్ డీపీఆర్‌వో నియామకమే జరగలేదు. కేవలం ఇంఛార్జితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో అధికారిక సమాచారం సరైన సమయంలో పత్రికలకు అందడం లేదు. దీంతో ఆ పత్రికలు కూడా అధికారిక సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు ఆద్యంతం ఆటంకం కలుగుతోంది. అధికారిక సమాచారాన్ని పత్రికలకు చేరవేసేందుకు వాట్సప్‌లో పేరుకు మాత్రమే డీపీఆర్‌వో గ్రూప్ పెట్టినట్లుగా ఉంది. కలెక్టరేట్‌లో అధికారిక సమీక్షలు, సమావేశాలు జరిగితే వాటి సమాచారాన్ని పత్రికలకు విడుదల చేసేందుకు ఈ సమాచార, పౌర సంబంధాల శాఖ గంటల కొద్దీ సమయం తీసుకుంటోంది. చివరికి ప్రెస్‌నోట్లు పంపడంలో కూడా తీవ్రమైన కాలయాపన జరుగుతోంది. ఫలితంగా స్థానిక మీడియా ప్రతినిధులు ఈ సమాచారాన్ని క్రోడీకరించుకొని ప్రచురణ కేంద్రాలకు పంపేందుకు మరింత ఆలస్యం కావడానికి కారణమవుతోంది. మొత్తంగా సమాచారం పంపే విధుల్లో ఈ శాఖ విఫలమవుతోంది.

సకాలంలో పత్రికలకు అందని సమాచారం..

గతంలో కొత్తగూడెంలో ఉండే కలెక్టరేట్‌లో సమాచారం ఆలస్యమైనా మీడియా ప్రతినిధులు ఐఅండ్‌పీఆర్ ఆఫీసుకు వెళ్లి సమాచారం తెచ్చుకునే వారు. ఇప్పుడు ఈ కార్యాలయం పాల్వంచ ఐడీవోసీలోకి మారింది. ఒకవేళ సమాచారం కోసం సమయం వెచ్చించి అక్కడికి వెళ్లినా ఆ కార్యాలయంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. అధికారిక సమావేశాల పేరుతో కాన్ఫరెన్స్ హాల్లో ఉంటుండడంతో ప్రెస్‌నోట్లు, ఇతర సమాచారాలు పత్రికలకు ఆలస్యమవుతున్నాయి. కొత్తగా వచ్చిన ఏపీఆర్‌వోకు డీపీఆర్‌వో బాధ్యతలు అప్పగించినా కార్యాలయ పాలన తూతూమంత్రంగానే కొనసాగుతోంది. అసలు భద్రాద్రిని కొత్త జిల్లాగా ఏర్పాటు చేసినప్పుడు రెగ్యులర్ డీపీఆర్‌వోగా శ్రీనివాస్‌ను నియమించారు. 2020లో డిప్యూటేషన్‌పై ఆయన హైదరాబాద్ వెళ్లారు. అప్పుడు భద్రాచలం ఏపీఆర్‌వోగా ఉన్న శ్రీనివాసరావుకు ఇంఛార్జి డీపీఆర్‌వోగా బాధ్యతలు ఇచ్చారు. ఆయన కూడా ఇటీవల భూపాలపల్లికి బదిలీ అయ్యారు. దీంతో కొత్తగూడెం ఏపీఆర్‌వోగా ఉన్న హజ్గర్‌కు ఇంఛార్జి డీపీఆర్‌వోగా బాధ్యతలు అప్పటించారు. ఇలా నాలుగేళ్లుగా ఇంఛార్జులతో మాత్రమే ఈ శాఖ పాలన కొనసాగుతోంది.

ఐడీవోసీకే పరిమితం..

ఈ ఐఅండ్‌పీఆర్ విధులు కేవలం ఐడీవోసీకి మాత్రమే పరిమితమవుతున్నాయి. ఆలస్యంగానైనా అక్కడి సమాచారం మాత్రమే పత్రికలకు అందిస్తున్నారు. రెవెన్యూ డివిజన్ల స్థాయిలోగానీ, చివరికి జడ్పీలోగానీ జరిగే అధికారిక సమావేశాలకు ఆ శాఖ నుంచి ఎవరూ రావడంలేదు. ఆ సమాచారాన్ని పత్రికలకు పంపడమూ లేదు.

నాకు ఎఫ్ఏసీ ఇవ్వలేదు..

ఇక్కడి రెగ్యులర్ డీపీఆర్‌వో డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌లో ఉన్నారు. గత ఇంఛార్జి డీపీఆర్‌వో బదిలీపై వెళ్లారు. నాకు కూడా ఇంఛార్జి బాధ్యతలే ఇచ్చారు. ఎఫ్ఏసీ ఏమీ ఇవ్వలేదు. కార్యాలయంలో ఎలాంటి సమాచారమున్నా దానిని వెంటనే పత్రికలకు ఇస్తున్నాం. మా శాఖలో సిబ్బంది లేరనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

–హజ్గర్, ఇంఛార్జి డీపీఆర్‌వో, భద్రాద్రి